సాక్షి
కుమురం భీం

సోమవారం ၊ 25 ၊ సెప్టెంబర్ ၊ 2023



'మధుర' సంస్కృతి.. విభిన్నం
తెలంగాణలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో మధుర తెగ ప్రజలు విస్తరించి ఉన్నారు. వీరిలో ఉమ్మడి కుటుంబాలే అధికంగా ఉంటాయి. 8లో▸

బెర్లిన్ మారథాన్‌లో ఎస్పీ



బెర్లిన్‌లో జరిగిన మారథాన్‌లో ఎస్పీ సురేశ్‌కు మార్ సత్తా చాటారు. 42.19 కిలోమీటర్ల దూరాన్ని 5.30 గంటల వ్యవధిలో పూర్తి చేశారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
29.5 /24.4

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతుపవనాలు, తుపాను ప్రభావంతో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

బీజేపీ జిల్లా కార్యదర్శిగా ఆడె నాందేవ్

కాగజ్‌నగర్‌టౌన్: బీజేపీ జిల్లా కార్యదర్శిగా ఆడె నాందేవ్ నియమితులయ్యారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా గొత్రే గోపాల్‌ను నియమించారు.

వ్యవసాయాధికారులు తనిఖీలు చేపట్టాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో కృత్రిమ కొరత సృష్టించి ఎరువులను అధిక ధరలకు అమ్ముతున్నారని, వ్యవసాయాధికారులు తనిఖీ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దినకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కృత్రిమ కొరతతో రైతులకు యూరియా, ఇతర ఎరువులు అధిక ధరలకు అమ్ముతూ దోపిడీకి గురిచేస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయ అధికారులకు ఫిర్యాదులు అందితేగానీ తనిఖీ చేపట్టడం లేదన్నారు. ఇప్పటికైనా తనిఖీలు చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కార్తీక్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో అక్టోబర్ 1, 2 తేదీల్లో నిర్వహించే జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆదివారం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలకు సంఘం రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. దేశంలో నిరుద్యోగులు పెరుగుతున్నారని, ప్రభుత్వం ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, పురుషోత్తం, నాయకులు నిఖిల్, సహాయ కార్యదర్శులు రాజ్‌కుమార్, శ్రావణి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ అరెస్టులు సరికాదు'

ఆసిఫాబాద్‌రూరల్: 317 జీవోతో స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని సీఎంకు విన్నవించుకునేందుకు ప్రగతిభవన్‌కు వెళ్లిన వారిని అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బదిలీలు, పదోన్నతుల ద్వారా ఏర్పడిన ఖాళీలను 317 జీవో బాధితులతో భర్తీ చేయాలన్నారు. స్థానికత పునాదుల మీద ఏర్పడిన తెలంగాణలో మళ్లీ స్థానికత కోసం పోరాటం చేయాల్సిన దుస్థితిని ప్రభుత్వం కల్పించిందని మండిపడ్డారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న ఉపేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): ఫారెస్ట్ నర్సరీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం తెలంగాణ ఫారెస్టు నర్సరీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుమారు పదేళ్లుగా ఫారెస్టు నర్సరీలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం చాలీచాలని వేతనాలు చెల్లిస్తోందన్నారు. నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవటంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వేతనాలు చెల్లించని పక్షంలో డీఎఫ్‌వో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దివాకర్, ప్రధాన కార్యదర్శి సంఘమిత్ర, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేష్, సుధాకర్, సహాయ కార్యదర్శి కవిత, కోశాధికారి సుజాత పాల్గొన్నారు.

ట్రయల్ రన్‌కు రెడీ

- వీరూర్ నుంచి కాగజ్‌నగర్ వరకు పూర్తయిన మూడోలైన్
- 26న ట్రయల్ రన్ నిర్వహించనున్న రైల్వేశాఖ
- త్వరలో రైళ్లు పునరుద్ధరించే అవకాశం



సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన మూడోలైన్

సిర్పూర్(టి): కాజీపేట– బల్లార్షా ప్రధాన రైల్వేలైన్‌లో చేపట్టిన మూడో రైల్వేలైన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. మహారాష్ట్రలోని వీరూర్ రైల్వేస్టేషన్ నుంచి కాగజ్‌నగర్ స్టేషన్ వరకు పనులు దాదాపు పూర్తయ్యాయి. ఈ నెల 26న రైల్వే ఉన్నతాధికారులు వీరూర్ నుంచి కాగజ్‌నగర్ వరకు ట్రయల్ రన్ నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ట్రయల్ రన్ తర్వాత పూర్తిస్థాయిలో ఈ మార్గంలో పూర్తిస్థాయిలో రైళ్లు నడవనున్నాయి.

పునఃప్రారంభం కానున్న రైళ్లు..
కొన్నేళ్లుగా కొనసాగుతున్న మూడో రైల్వేలైన్ పనులతో కాజీపేట– బల్లార్షా ప్రధాన మార్గంలో తరచూ రైళ్లు రద్దు చేస్తున్నారు. ప్యాసింజర్ రైళ్లు రద్దు చేయడం, సూపర్‌ఫాస్ట్‌లను కొన్ని స్టేషన్ల వరకే పరిమితం చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు నెలలుగా సిర్పూర్(టి) స్టేషన్ నుంచి ప్రజలకు రైళ్లు అందుబాటులో లేకుండా పోయాయి. అంతేకాక పనుల కోసం వేంపల్లి వద్ద ఉన్న రైల్వే గేటును సైతం మూసి ఉంచుతున్నారు. మూడో రైల్వేలైన్ పనులు తుది దశకు చేరుకోవడంతో ట్రయల్ రన్ తర్వాత రైళ్లను పునః ప్రారంభించే అవకాశం ఉంది. ముఖ్యంగా రామగిరి, పుష్పుల్, సింగరేణి ప్యాసింజర్ రైళ్లతోపాటు భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌లను పునరుద్ధరించనున్నారు. సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ నుంచి మహారాష్ట్రతోపాటు మంచిర్యాల, కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్ తదితర పట్టణాలకు రాకపోకలు సాగించే వీలు కలగనుంది.

అందుబాటులోకి మరిన్ని రైళ్లు..
కాజీపేట– బల్లార్షా మధ్యం మూడో లైన్ పనులు పూర్తికానుండటంతో ప్రయాణికులకు మరిన్ని ప్యాసింజర్ రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ ప్రధాన మార్గంలో సిర్పూర్(టి), కాగజ్‌నగర్ స్టేషన్లలో సూపర్‌ఫాస్ట్‌లు, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

కీలకంగా మారనున్న మూడోలైన్..
సికింద్రాబాద్ నుంచి ఢిల్లీ మార్గంలో కాజీపేట– బల్లార్షా మధ్య మూడో రైల్వే లైన్ కీలకం కానుంది. ప్రస్తుతం అధిక రద్దీతో సూపర్‌ఫాస్ట్ రైళ్లతో పాటు గూడ్స్ రైళ్లు అనుకున్న సమయానికి గమ్యాన్ని చేరలేకపోతున్నాయి. ఈ క్రమంలో రైల్వేశాఖ మూడోలైన్ పనులు చేపట్టింది. అలాగే అవసరమైన రైల్వేస్టేషన్లలో అధునాతన సౌకర్యాలతో నూతన నిర్మాణాలు, భవనాలు అందుబాటులోకి తెస్తున్నారు. సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం వెయిటింగ్ హాల్, మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు ఉన్న ఫ్లై ఓవర్ బ్రిడ్జిని కూడా తొలగించి కొత్తది ఏర్పాటు చేస్తున్నారు. నెల రోజుల్లో ఈ పనులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు.



కొనసాగుతున్న రైల్వే ఫ్లైఓవర్ పనులు

సంతోషకరం



మూడో లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా సిర్పూర్(టి) రైల్వేస్టేషన్‌కు నిధులు మంజూరు కావడంతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. సిర్పూర్(టి) రైల్వేస్టేషన్‌లో అధునాతన వసతులు కల్పించడం సంతోషకరం. పనులు వేగంగా పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలి.

– మల్కరి ప్రసాద్, ప్రయాణికుడు

కష్టాలు తీరుతాయి



కాజీపేట– బల్లార్షా మధ్య మూడో లైన్ అందుబాటులోకి వస్తే రైళ్ల రాకపోకలకు ఇకపై ఇబ్బందులు ఉండవు. రద్దయిన రైళ్లను కూడా పునరుద్ధరిస్తే ప్రయాణికుల కష్టాలు కూడా తీరుతాయి. రైళ్లను పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కరుణాకర్‌గౌడ్, సిర్పూర్(టి)

నిబంధనలకు చెల్లుచీటి!

- ఫర్టిలైజర్ షాపుల్లో కనిపించని ధరల సూచిక బోర్డులు
- ఇష్టారాజ్యంగా ఎరువులు, పురుగుమందుల విక్రయాలు
- తూతూమంత్రంగా అధికారుల తనిఖీలు
- జిల్లాలో 250 దుకాణాలు



ధరల బోర్డు లేని కౌటాలలోని ఓ ఫర్టిలైజర్ షాపు

కౌటాల(సిర్పూర్): జిల్లాలో మళ్లీ వర్షాలు కురుస్తుండటంతో రైతులు పంటలకు ఎరువులు వేసేందుకు ఫర్టిలైజర్ దుకాణాలకు పరుగులు తీస్తున్నారు. అలాగే పత్తి, సోయా పంటలను తెగుళ్లు ఆశిస్తుండటంతో పురుగుమందులూ కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదనుగా కొంత మంది ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ రైతులను దోపిడీకి గురిచేస్తున్నారు. కౌటాల మండలం గుడ్లబోరి గ్రామంలోని ఓ ఫర్టిలైజర్ డీలర్ అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నాడని స్థానికుల నుంచి ఆరోపణలు రాగా.. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని తెలుస్తోంది. ఎరువులు, విత్తనాలు, రసాయనిక మందుల ధరలు తెలిపే సూచిక బోర్డులు షాపుల్లో ఏర్పాటు చేయడం లేదు.

జాడలేని బోర్డులు.. పట్టించుకోని అధికారులు
విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో స్టాకు, ధరల పట్టిక, తదితర నిబంధనలు పాటించడంలో డీలర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ధరల పట్టికలు షాపుల్లో మచ్చుకు కూడా కనిపించడం లేదు. కొన్నిచోట్ల కేవలం అధికారులు తనిఖీకి వచ్చే సమయంలోనే బయట ఉంచి, వారు వెళ్లగానే ఎవరికీ కనిపించకుండా షాపుల్లో దాస్తున్నారు. ఏఏ కంపెనీలు అనుమతి పొందాయో కూడా స్పష్టంగా తెలియడం లేదు. రెండు, మూడు రోజులుగా జిల్లాలో వర్షం పడుతుండటంతో రైతులు ఎరువులు వేయడంతో పాటు అవసరమైన మందులు పిచికారీ చేస్తున్నారు. కొంత మంది డీలర్లు అధికంగా కమీషన్ లభించే ఎరువులు, మందులనే రైతులకు అంటగడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విస్తృతంగా తనిఖీలు చేపట్టి ఫర్టిలైజర్ షాపుల్లో నిబంధనలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఇదే విషయమై జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్‌రావు సంప్రదించగా.. ఎరువులు, విత్తనాలు, పిచికారీ మందులు అధిక ధరలు విక్రయించే ఫర్టిలైజర్ దుకాణాల యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రోజువారీ వివరాలతో ధరల సూచిక బోర్డులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు పాటించని ఫర్టిలైజర్ షాపులకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

అధిక ధరలకు విక్రయం..
ఈ వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 4.51 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. పత్తి 3,35,178 ఎకరాలు, కంది 46,096, వరి 54,611, పెసర 3017, సోయా 1,524 ఎకరాల్లో సాగులో ఉంది. 250కి పైగా ఫర్టిలైజర్ దుకాణాలు ఉన్నాయి. అధిక దిగుబడిపై ఆశతో అన్నదాతలు మోతాదుకు మించి ఎరువులు వినియోగిస్తున్నారు. దీనిని అనుకూలంగా మార్చుకుంటున్న డీలర్లు అధిక ధరలకు విక్రయాలు జరుపుతున్నారు. డీఏపీ బస్తా అసలు ధర రూ.1,350 ఉంటే రూ.1,400 వరకు విక్రయిస్తున్నారు. ప్రతీ బస్తాపై రైతులకు రూ.50 అదనపు భారం పడుతోంది. అలాగే యూరియా బస్తా ధర రూ.270 ఉంటే అన్నదాతలు రూ.320 నుంచి రూ.350 కొనుగోలు చేయాల్సిన పరిస్థితి.

అడ, వట్టివాగు ప్రాజెక్టులకు వరద

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అడ(కుమురంభీం), వట్టివాగు ప్రాజెక్టుల్లోకి వరద చేరుతోంది. ఆదివారం రెండు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని కిందికి వదిలారు. అడ ప్రాజెక్టు ఒక గేటు 0.60మీటర్లు పైకెత్తి 1,260 క్యూసెక్కుల నీటిని దిగువకు వదుతుండగా, వట్టివాగు ప్రాజెక్టు రెండు గేట్లను మీటర్ పైకెత్తి 3,578 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు వాగుల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పీఆర్టీయూ కృషితో బదిలీలు, పదోన్నతులు

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్రంలో పీఆర్టీయూ కృషితోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సాధ్యమైందని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వడ్డెపల్లి గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన పీఆర్‌టీయూ జిల్లా సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనం పెంచేలా కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా నుంచి ఇతర జిల్లాకు వెళ్లిన ఎంఈవోలను సన్మానించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాశ్, ఎంఈవోలు భిక్షపతి, వెంకటేశ్వరస్వామి, భానుకుమార్, ఉదయ్‌బాబు, సంఘం నాయకులు రాజాకమలాకర్, చైతన్య, శంకర్, శ్రావణ్, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జోడేఘాట్ దర్శనీయ స్థలం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురంభీం పోరాటం చేసి అసువులు బాసిన జోడేఘాట్ దర్శనీయస్థలమని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే ప్రకాశ్, ఉపాధ్యాయులు రాజ్‌కమలాకర్‌తో కలిసి జోడేఘాట్‌ను సందర్శించారు. భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మ్యూజియాన్ని సందర్శించారు.

సమ్మె విరమించిన లారీ అసోసియేషన్

- ఎస్పీఎం యాజమాన్యంతో చర్చలు సఫలం

కాగజ్‌నగర్‌టౌన్: లారీ అసోసియేషన్– ఎస్పీఎం యాజమాన్యం మధ్య జరిగిన చర్చలు సఫలమైనట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్‌బాబు, కార్యదర్శి నిజాముద్దీన్, కోశాధికారి ఖయ్యూమ్, ఉపాధ్యక్షుడు షమా, తాజ్, పాషా తెలిపారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో శనివారం రాత్రి డీఎస్పీ కరుణాకర్, కాగజ్‌నగర్ సీఐ బి.స్వామి, ఎస్పీఎం ప్రతినిధులు ఎ.కె.మిశ్రా, సురేందర్, రమేశ్‌రావు, గిరి ఆధ్వర్యంలో అసోసియేషన్ డిమాండ్లపై జరిగిన చర్చలు కొలిక్కి వచ్చినట్లు వారు పేర్కొన్నారు. లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎస్పీఎంలో ఉత్పత్తి అయిన కాగితాన్ని ఎగుమతి కోసం ప్రస్తుతం లారీ అసోసియేషన్ లారీలకు 12 ప్రాంతాల్లో అనుమతినివ్వగా, మరో రెండు ప్రాంతాలకు పెంచారు. ప్రస్తుతం ట్రాన్స్‌పోర్టర్లకు కేటాయిస్తున్న ధరను 30 శాతం పెంపు, వెయిటింగ్ చార్జీలు, మిల్లులోని ఎగుమతి, దిగుమతుల నిమిత్తం వచ్చే లారీల డ్రైవర్, క్లీనర్లకు మిల్లులోనే క్యాంటీన్ సదుపాయం, విశ్రాంతికి ప్రత్యేకంగా గదుల కేటాయింపు తదితర డిమాండ్లను యాజమాన్యం అంగీకరించినట్లు ఆయన పేర్కొన్నారు. డిమాండ్ల అమలుకు సహకరించిన ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



వివరాలు వెల్లడిస్తున్న నాయకులు

లంబోదరుడికి నైవేద్యాలు



శారదా గణేశ్ మండలి వద్ద 121 రకాలు



కాగజ్‌నగర్ ఆర్యవైశ్య భవన్‌లో 108 రకాలు

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్‌టౌన్: గణేష్ నవరాత్రుల్లో భాగంగా లంబోదరుడికి భక్తులు ప్రత్యేక పూజలు, అలంకరణలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని బాపూనగర్‌లో గల శారదా గణేష్ మండలి ఆధ్వర్యంలో ఆదివారం బొజ్జ గణపయ్యకు 121 రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. అలాగే కాగజ్‌నగర్ ఆర్యవైశ్య భవన్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడికి ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు గర్రెపల్లి గోపాల్–స్వాతి దంపతుల ఆధ్వర్యంలో 108 రకాల నైవేద్యాలు సమర్పించారు.

యూరియా.. నోస్టాక్!

- పంటల చివరి దశలో కొరత
- ప్రైవేటు డీలర్ల వద్ద లేని నిల్వలు
- కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు
- జిల్లాలో 4.51 లక్షలకు పైగా ఎకరాల్లో పంటలు



చింతలమానెపల్లి(సిర్పూర్): దేశానికి అన్నం పెట్టే రైతన్నకు సాగుకు సహకారం అందడం లేదు. విత్తనం విత్తినప్పటి నుంచి దిగుబడి వచ్చే వరకు ఆటంకాలు ఎదురవుతూ ఉన్నాయి. ముఖ్యంగా విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ప్రస్తుతం పంటలకు చివరి మందులు వేయాల్సిన తరుణంలో జిల్లాలో యూరియా కొరత ఉంది. ఫెర్టిలైజర్ కేంద్రాల వద్ద అన్నదాతలు పడిగాపులు కాస్తున్నారు. వానా కాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 4.51 ఎకరాల్లో పంటలు సాగు చే శారు. అత్యధికరంగా 3,35,178 ఎకరాల్లో పత్తి, 46,096 ఎకరాల్లో కంది, 54,611 ఎకరాల్లో వరి సాగు ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

ఆలస్యంగా నాట్లు..
జిల్లా వ్యాప్తంగా రైతులు భూమి, సాగు నీరు, వాతావరణ పరిస్థితులను అనుసరించి పంటలు సాగు చేస్తున్నారు. కెరమెరి, జైనూర్, వాంకిడి, ఆసిఫాబాద్ మండలాల్లో వరి సాగు తక్కువగా ఉండగా, కాగజ్‌నగర్ గ్రామీణం, దహెగాం, కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల్లో ఎక్కువగా ఉంది. వర్షాలు ఆలస్యం కావడంతో వరి నాట్లు ఆలస్యమయ్యాయి. అనంతరం ఆగస్టు, సెప్టెంబర్‌లో సాగు జోరందుకుంది. వర్షాలతో సంబంధం లేకుండా పత్తి, కంది, ఇతర పంటలు యథావిధిగా వేసుకున్నారు.

కొరత లేదు

జిల్లాలో యూరియా కొరత లేదు. ప్రభుత్వం సరఫరా చేసిన యూరియాను మండల వ్యవసాయ అధికారులు అందించిన నివేదికల ఆధారంగా ఆయా మండలాలకు సరఫరా చేస్తున్నాం. వరి సాగు చేసే ప్రాంతాలకు అదనంగా కేటాయిస్తున్నాం. యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రైవేటు డీలర్లకు ప్రభుత్వ నిబంధనలను అనుసరించి కేటాయిస్తాం.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి

35వేల మెట్రిక్ టన్నులు సరఫరా
ఈ వ్యవసాయ సీజన్‌కు సంబంధించి జిల్లాకు 35 వేల మెట్రిక్ టన్నుల యూరియాను ప్రభుత్వం సరఫరా చేసింది. ప్రస్తుతం 3700 మెట్రిక్ టన్నుల నిల్వ ఉందని అధికారులు పేర్కొంటున్నారు. వ్యవసాయ అధికారులు అందించే నివేదికలను అనుసరించి మండలాలకు నిల్వలు కేటాయిస్తున్నారు. అయితే కొన్ని మండలాల్లో వినియోగంలో తేడాలు ఉన్నాయి. అధికారులు ఈ వినియోగాన్ని పరిగణలోకి తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే మండల కేంద్రాల్లోని సరఫరా కేంద్రాలకు వచ్చి యూరియా కొనుగోలు చేయడం రైతులకు అదనపు భారంగా మారింది. పరిమితంగానే యూరియా పంపిణీ చేస్తుండటంతో, పంటలకు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరి సాగు ఉన్న మండలాల్లో కొరత
రైతులు పంటలకు వివిధ దశల్లో మొక్కల ఎదుగుదలకు అనుగుణంగా ఎరువులు వినియోగిస్తారు. మొక్కలు ఏపుగా పెరగడానికి యూరియా అవసరం ఉంటుంది. ఇతర కాంప్లెక్స్ ఎరువులతో కలిపి దీనిని వినియోగిస్తున్నారు. వరికి నాట్లు వేసే సమయంలో, నాట్లు వేసిన అనంతరం వర్షాలు కురిసే సమయంలోనూ యూరియా వేస్తారు. పత్తి పంట చివరి దశలో ఒకసారి యూరియా అవసరం ఉంటుంది. పత్తి సాగు ఎక్కువగా ఉన్న మండలాలతో పోలిస్తే వరి సాగు ఉన్న ప్రాంతాల్లో యూరియా అవసరం అధికంగా ఉంది. వరి సాగు చేస్తున్న రైతులు యూరియా కొరతను ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు, ప్రభుత్వ సరఫరా ఏజెన్సీలైన సహకార సంఘాలు, ఆగ్రోస్, డీసీఎంఎస్‌ల ద్వారా ప్రభుత్వం యూరియా సరఫరా చేస్తోంది. వీటికి 60:40 నిష్పత్తిలో కేటాయిస్తోంది. ఆరంభంలోనే కోటా పూర్తి చేసుకున్న ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాలకు ప్రభుత్వం ప్రస్తుతం యూరియా కేటాయించడం లేదు. వీరికి అక్టోబర్ అనంతరం తిరిగి కేటాయిస్తామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం సహకార సంఘాలు, ఆగ్రోస్ వంటి సంస్థల ద్వారా కొన్ని ప్రాంతాల్లో మాత్రమే యూరియా సరఫరా ఉంది. ఈ కారణంగా క్షేత్రస్థాయిలో కొరత ఏర్పడుతోంది.

నీలి జెండాతోనే అభివృద్ధి సాధ్యం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కౌటాల: నీలి జెండాతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కౌటాలలో ఆదివారం సాయంత్రం బీఎస్పీ మండల కార్యాలయాన్ని ప్రారంభించారు. అంతకు ముందు పార్టీ జెండా ఎగురవేశారు. బీఆర్ఎస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి పలువురు నాయకులు బీఎస్పీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఆర్ఎస్పీ మాట్లాడుతూ సిర్పూర్‌లో గతంలో ఏనుగు గుర్తుపై ఎమ్మెల్యేగా గెలుపొందింది, పార్టీ మారిన కోనేరు కోనప్పకు బుద్ధి చెప్పాలన్నారు. కోనప్ప ఆగడాలను భరించలేక ఇక్కడి ప్రజల కోరిక మేరకే తాను పోటీ చేస్తున్నానని స్పష్టం చేశారు. నిజాయతీగా వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై కేసులు నమోదు చేయించడం దారుణమన్నారు. త్వరలో కౌటాలలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి చేయాలి
సిర్పూర్(టి): బీఎస్పీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చింతకుంట, సిర్పూర్(టి) గ్రామాల్లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. చింతకుంట, చుంచుపల్లి గ్రామాలకు చెందిన పలువురు బీఎస్పీలో చేరారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి జెండా ఆవిష్కరించారు.

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ గ్రామంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విస్తృతంగా పర్యటించారు. విలేజ్ నం.3లో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాల్లో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యదర్శులు సిడాం గణపతి, అర్షద్ హుస్సేన్, నాయకులు వెంకటేశ్, నవీన్, నాగయ్య, గోవింద్‌రావు, సాయినాథ్, ప్రవీణ్, తిరుపతి, విజయ నిర్మల, సిడాం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కౌటాలలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నాయకులు

క్లుప్తంగా

వర్షానికి కూలిన ఇంటిగోడ



కూలిన గోడ వద్ద బాధితుడు

భీమిని: ఆదివారం కురిసిన వర్షానికి మండల కేంద్రంలోని కుర్మిళ్ల భీమయ్యకు చెందిన ఇంటి గోడ కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది.

భూవివాదంలో ఇరువర్గాల దాడి

కౌటాల(సిర్పూర్): మండలంలోని వీరవెల్లిలో ఆదివారం భూ వివాదంతో ఇరువర్గాలు పరస్పరం దాడులకు పాల్పడ్డాయి. పలువురికి గాయాలు కావడంతో సిర్పూర్(టి) సామాజిక ఆస్పత్రికి తరలించారు. గ్రామంలోని ఓ వివాదాస్పద భూమి విషయంలో ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. ఈ విషయంపై ఎస్సై మధుకర్‌ను వివరణ కోరగా భూమి విషయంలో గొడవ జరిగింది వాస్తవమేనని, పూర్తి విచారణ చేపట్టి వివరాలు వెల్లడిస్తామన్నారు.

గాంధీభవన్‌లో బీసీ నాయకుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న నీలకంఠేశ్వర్

మంచిర్యాలటౌన్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి బీసీలకు టికెట్ల కేటాయింపుపై ఓబీసీలు ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో చర్చలు జరిపారు. సమావేశానికి 88 నియోజకవర్గాల నుంచి ఓబీసీలు హాజరుకాగా మంచిర్యాల నుంచి డాక్టర్ నీలకంఠేశ్వర్ పాల్గొన్నారు. పార్టీ అధిష్టానం రాష్ట్రంలో 34 సీట్లను బీసీలకు కేటాయించాలని నిర్ణయించగా 44 కేటాయించాలని డిమాండ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

జోనల్‌స్థాయి పోటీలకు క్రీడాకారులు ఎంపిక

తాండూర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సురభి గార్డెన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ బాలబాలికల ఎంపిక పోటీలు శనివారంతో ముగిశాయి. అండర్-14 బాలుర విభాగంలో మయూర్, కౌవల్యరామ్, నిహాల్, సూర్యతేజ్, విశ్వసృజన్, బృహన్‌రుషి, బాలికల విభాగంలో శ్రీహర్షిణి, మేఘన, సిద్సాయి, సాన్విక, అక్షయ, అండర్-17 బాలుర విభాగంలో హర్షవర్ధన్‌రెడ్డి, విశ్వతేజ, గోపి, అనుదీప్ ఉండగా, బాలికల విభాగంలో మల్లేశ్వరి, జయ రాజహంస, హారిని, నిహారిక, అనూష ప్రతిభ కనబర్చారు. సదరు క్రీడాకారులు అక్టోబర్ మొదటివారంలో జరిగే జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ పరిమళ తెలిపారు.

మధుర సంస్కృతి.. విభిన్నం

- వేష, భాషలో ప్రత్యేకత
- ఉత్తర భారతం నుంచి వలస వచ్చిన తెగ
- అకాడ, తీజ్, జోహారా ప్రత్యేక పండుగలు

బజార్‌హత్నూర్(బోథ్): చెమటచుక్క లెక్కచేయని శ్రామికులు.. అందం, అమాయకత్వం కలగలిసిన పశు ప్రేమికులు.. అడవిని జయించగల పూరేకులు.. భూమిని చుట్టేయగల ప్రకృతి ప్రేమికులు.. నాగరిక సమాజానికి కాస్త దగ్గరగా ఉన్న సంచార సమూహమే మధుర తెగ. ఇందులో 11 గోత్రాల వారున్నారు. వీరిలో ఉమ్మడి కుటుంబాలే అధికం. ఈ తెగకు పెద్ద నాయక్. తెలంగాణలో ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో మాత్రమే ఈ తెగ కనబడుతుంది.



జోహారా కార్యక్రమంలో భాగంగా పుట్టమన్ను తెస్తున్న మహిళలు (ఫైల్)



ఆభరణాలు ధరించిన మహిళ (ఫైల్)



పాచికలు ఆడుతున్న పురుషులు (ఫైల్)

ఆచార సంప్రదాయాలు

ఈ సంచార తెగ ఒకప్పుడు ఉత్తర భారతం నుంచి వలస వచ్చిన సంచారజీవులు. ప్రస్తుతం అటవీప్రాంతాల సమీపంలో, కొండలు, వాగుల వద్ద స్థిరపడ్డారు. ప్రధానంగా పశు కాపరులు. వీరి ఆర్థికస్థితిని పశువుల సంఖ్యతోనే లెక్కగడుతారు. దశాబ్దాల క్రితం గోవులను మేపుకుంటూ నెలల తరబడి ఇంటికి దూరంగా వెళ్లేవారు. మొదట్లో పోడు వ్యవసాయం చేసేవారు. ప్రస్తుతం పశుసంపదతో పాటు వ్యవసాయం చేస్తున్నారు. ఆచార సంప్రదాయాల్లోనే కాదు వేషభాషల్లోనూ ఈ తెగ ప్రత్యేకమే. ఎంతో విశిష్టత సంతరించుకున్న మధుర తెగను కయితి లబానా, మధుర లబానా, మురికి లబానా అని పిలుస్తారు. 1708లో ఉత్తర భారతదేశంలోని పంజాబ్ నుంచి మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతానికి ఈ తెగ వలస వచ్చినట్లు ప్రతీతి.

పండుగలకు ప్రత్యేక స్థానం

మారెమ్మ, మావలి, అకాడి, నాగులపంచమి, జోహారా, రాఖీ, దసరా పండుగలు వారి జీవితాల్లో ప్రధానమైనవి. కృష్ణున్ని అమితంగా పూజిస్తారు. హోలీని మూడురోజుల పాటు జరుపుకుంటారు. దూల్, దూలండి, పాయిబీచ్..ఇలా రోజుకో కార్యక్రమం జరుగుతుంది.

ఆడపిల్లల ప్రత్యేక పండుగ జోహారా

పాముల పుట్ట (చీమల పుట్ట) నుంచి తెచ్చిన బంక మట్టిలో గోధుమ గింజలు, శనగ గింజలు పోయగా మొలకెత్తిన వాటినే జోహారా అంటారు. నాగుల పంచమి తర్వాత మూడు రోజులకు ఈ పండుగ ఉంటుంది. ఈ నారుకు పెళ్లికానివారు 8 రోజుల పాటు బావి నుంచి నీరు తెచ్చి పోస్తారు. ఇలా ఎనిమిదో రోజు రాత్రి పూట కన్నయ్య(బంక మట్టి ముద్ద)కు పూజిస్తారు.

మహిళలది ప్రత్యేక స్థానం

వీరి ప్రధాన వృత్తి పశుపోషణ. ఇందులో సింహభాగం పనులు మహిళలే చేస్తారు. వీరికి ఆభరణాలంటే అమితాసక్తి. ఊడిపోయిన తల వెంట్రుకలను పోగు చేసుకుని నిలువుగా కుట్టిన గుడ్డలో వాటిని ఉంచి చుండాను తయారు చేస్తారు. తలపై నుంచి చుండా పడిపోకుండా బ్యాలెన్స్ చేసే డోరాను కట్టుకుంటారు. నుదిటిపై టిక్కి, ముక్కుకు ఉండే నథోలి, మెడలో ఉండే ఆభరణంలో రాకిడి, నమోలి, కపోర్, పావుల, ఘాటి, చెవులకు ఘాటి, బీట్‌కేట్, చేతి గాజుల్లా కనిపించే ఘోట్, మెగర్, మోచేతులపైకి ఉండే అలియా, గజార, డోరా, కాళ్లకు చూడా, లాక్, భీడ్, నడుముకు కాచులి, గాగ్రా, కాలి వేళ్లకి బిచ్కా, చట్కి, గుట్టి వంటి ఆభరణాలు ధరిస్తారు. పెళ్లి కాని ఆడపిల్లలు లెహంగా, కబ్లీ దుస్తులు ధరిస్తారు. పురుషులకు ఆహార్యంలో పాగడి, పరికి, పలోపేటి, దండా డోక, డోనియా, జగ్లి, దోతి, కంగ్రి రుమాల్, పంచ ప్రధానంగా కనిపిస్తాయి.

సంప్రదాయక ఆహారం

గోధుమ రోటి, శనగ, పెసర, మొక్కజొన్నలకు సంబంధించిన ఆహారం, పాలు, పెరుగు, వెన్న, ఆవు నెయ్యి, టీ, బెల్లం, తీపి పదార్థాలు ఎక్కువగా తీసుకుంటారు. పండుగల సమయంలో మాల్‌పూవ, సిరా, గేహర్, పూరి, మలిద, లాబ్సీ వంటి పిండి వంటకాలతో పాటు పల్లి, కందగడ్డలతో పాయసం చేసుకుంటారు. వంటలకు కట్టెల పొయ్యినే వాడుతారు. అప్పట్లో పొయ్యిలో నిప్పు ఉన్నప్పుడు అన్నం తినేవారు. ఒకవేళ నిప్పు ఆరిపోతే అన్నం తినేవారు కాదు. కొందరు ప్రభుత్వం ఇచ్చిన పక్కా ఇళ్లు కట్టుకున్నా మిగతా వారు ఇప్పటికీ గుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నారు. అడవుల్లోని కలప దుంగలతో ఇళ్లు కట్టుకుంటారు. పైకప్పుగా టీన్స్, వరిగడ్డిని వాడుతారు.



కన్నయ్యను పూజిస్తున్న యువతులు (ఫైల్)

తీజ్ కూడా ప్రత్యేకమే

బంజారాల మాదిరిగా మధుర లబానా తెగవారు తీజ్ ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటారు. రాఖీపౌర్ణమి తర్వాత మూడు రోజులకు వచ్చే తీజ్‌ను పెళ్లి కాని ఆడపిల్లలు జరుపుకుంటారు. 21 రకాల పూలు, బంకమట్టితో కన్నయ్యను తయారు చేసి దేవుడిలా అలంకరించి పూజిస్తారు. రాత్రి పూట నిమజ్జనం చేస్తారు.

నగార (డోలు) వాయిద్యం

ఈ తెగ వారు ప్రతీ పండుగ, కార్యక్రమంలో ఉపయోగించే వాయిద్యం నగార. దున్నపోతు చర్మంతో చేసిన నగార వారి అన్ని కార్యక్రమాలలో కీలకమైంది. వీరి ప్రధాన ఆటవిడుపు కార్యక్రమం చోప్టా(పాచికలు). ఆయా పండుగల్లో మహిళలు నృత్యం చేస్తూ పాటలు పాడుతూ ఉంటే పెద్దలు ఒకచోట కూర్చుని పాచికలు ఆడుతూ సేదతీరుతారు.

పండుగలంటే అభిమానం



మా మధుర సమాజంలోని మహిళలకు ఆభరణాలు, పండుగలంటే ప్రత్యేక అభిమానం. అకాడ, జోహారా, తీజ్ పండుగలు నియమ నిష్ఠలతో చేస్తాం. నూతన వస్త్రాలు, ఆభరణాలు ధరించి పూజలు చేస్తాం. పెళ్ళికాని ఆడపిల్లలు జోహారా, తీజ్ పండగలను జరుపుకుంటారు. మహిళల ప్రత్యేక ఆకర్షణగా చుండా ఉండేది. కానీ ప్రస్తుతం యువతులు చుండాను ధరించడానికి ఇబ్బంది పడుతున్నారు.

– అజాడే జయశ్రీ, ఎంపీపీ, బజార్‌హత్నూర్

పశుసంపదే మా కులవృత్తి



మధుర లబానా కులస్తుల కులవృత్తి పశుసంపద. గతంలో నెలల తరబడి పశువులను మేపుకుంటూ గ్రాసం ఉన్న దూరప్రాంతాలకు వెళ్లేవాళ్లం. ప్రస్తుతం సాగునీటి సౌకర్యాలు ఏర్పడటంతో వ్యవసాయంతో పాటు పశువులు కాస్తున్నాం. మా కులంలో ఇప్పటికీ కట్నకానుకల సమస్య లేదు. మా ఆచార సంప్రదాయాలు ఇలాగే కొనసాగిస్తాం.

– దరుసింగ్‌నాయక్, మంజరంతండా

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

శ్రీరాంపూర్(మంచిర్యాల): రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికల దృష్ట్యా సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్ పేర్కొన్నారు. ఆదివారం నస్పూర్ కాలనీలోని యూనియన్ కార్యాలయంలో కార్యకర్తల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ వేతన ఒప్పందంలో బీఎంఎస్ కీలక పాత్ర పోషించిందని, జేబీసీసీఐ సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి కృషి వల్లే కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం జరిగిందన్నారు. గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ వైఫల్యాలను కార్మికుల సమక్షంలో ఎండగట్టాలన్నారు. ఈ సందర్భంగా ఆర్కే 6 గనికి చెందిన ఆసంపల్లి రాయలింగు అనే కార్మికుడు యూనియన్‌లో చేరాడు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ సభ్యులు కాదాసి భీమయ్య, ఏరియా జాయింట్ సెక్రెటరీ పీ.వినోద్ కుమార్, నాయకులు రామకృష్ణ, రాకేష్, చంద్రశేఖర్, గోపతి సందీప్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



కండువాకప్పి ఆహ్వానిస్తున్న నాయకులు

గంజాయి గుట్టు రట్టు..!

- ట్రాక్టర్ బోల్తా పడడంతో వెలుగులోకి
- పోలీసుల అదుపులో నిల్వలు

శ్రీరాంపూర్: ట్రాక్టర్ బోల్తా పడడంతో గంజాయి అక్రమ రవాణా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ సమీపంలోని రహదారిపై జైపూర్-ఇందారం చౌరస్తా నుంచి శ్రీరాంపూర్ వైపునకు ఫ్లైయాష్ ఇటుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. శనివారం శ్రీరాంపూర్ పోలీసుల దృష్టికి రావడంతో ఘటనాస్థలిని సందర్శించారు. ట్రాక్టర్ వద్ద డ్రైవర్ లేకపోవడం, నంబర్ ప్లేట్ కూడా లేకపోవడంతో జేసీబీని పిలిపించి ట్రాక్టర్‌ను తీసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇటుకల అడుగున గంజాయి సంచులు గుర్తించారు. సుమారు మూడు నుంచి ఐదు క్వింటాళ్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ట్రాక్టర్‌ను, అందులోని సరుకును స్టేషన్‌కు తరలించారు. ఆదివారం ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై శ్రీరాంపూర్ ఎస్సై రాజేశ్‌ను సంప్రదించగా పూర్తి వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. ఇదిలా ఉండగా ఇంత పెద్దమొత్తంలో గంజాయి ఎక్కడి నుంచి వచ్చిందనేది చర్చనీయాంశంగా మారింది. ఇది చెన్నూరు పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి వచ్చి ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రాక్టర్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిసింది. పోలీసులు ట్రాక్టర్ బాడి, ఇంజన్ నంబర్ల ఆధారంగా రిజిస్ట్రేషన్ నంబర్ తెలుసుకుని దాని ఆధారంగా విచారణ సాగిస్తున్నట్లు తెలిసింది.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

రెవెన్యూలో అవినీతి చేపలు!

- ఏసీబీకి పట్టుబడిన ఇద్దరు అధికారులు
- పట్టాపాస్‌బుక్‌లో పేరు సవరణకు డబ్బులు డిమాండ్
- రూ.2లక్షలు తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన వైనం
- మావల తహసీల్దార్, ఆర్‌ఐ రిమాండ్‌కు తరలింపు

ఆదిలాబాద్‌రూరల్: రెవెన్యూ శాఖలో ఇద్దరు అవినీతి అధికారులు ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. పట్టాపాస్‌బుక్‌లో పేరు సవరణ కోసం ఓ రైతును కొంత కాలంగా తిప్పుకుంటున్నారు. ఈ క్రమంలో ఆ పని చేసేందుకు డబ్బులు డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఒప్పందం కుదుర్చుకున్న డబ్బులను అధికారులకు ముట్టజెబుతున్న సమయంలో దాడి చేసి పట్టుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మావల తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇద్దరు అధికారులు ఏసీబీకి చిక్కారని తెలియడంతో జిల్లా కేంద్రానికి చెందిన పలువురు కార్యాలయానికి చేరుకున్నారు. ఏం జరుగుతుందోనని తెలుసుకునేందుకు గుమిగూడారు.

అసలేం జరిగిందంటే..

నిజామాబాద్‌కు చెందిన నిర్మల్కర్ సుధాకర్‌తో పాటు ఆయన కుటుంబీకులకు సంబంధించి ఆదిలాబాద్ జిల్లా మావల శివారు సర్వే నం.181లో 14 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని అగ్రిమెంట్ రిప్రజెంటర్ యతేంద్రనాథ్ యాదవ్ తెలిపాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వివరాలు.. సుధాకర్‌కు సంబంధించిన భూమిలో ఒక్కొక్కరి పేరిట మూడున్నర ఎకరాలకు సంబంధించి పట్టాలు ఉన్నాయి. ఈ పట్టేదారైన సుధాకర్ వృద్ధుడు కావడంతో దీనికి సంబంధించిన వ్యవహారాలు చూసుకునేందుకు తనకు అప్పగించాడు. అయితే పట్టాపాస్‌బుక్‌లలో పేర్లకు సంబంధించి మార్పుల కోసం 2023 ఏప్రిల్ 13న మావల తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి తహసీల్దార్ కూడా ఈ పనుల విషయంలో జాప్యం చేశారు. ఆ తహసీల్దార్ బదిలీపై వెళ్లే సమయంలో కలెక్టర్ కార్యాలయానికి ఫైల్ పంపించారు. కలెక్టరేట్ నుంచి ఆగస్టు 11న మావల తహసీల్దార్ కార్యాలయానికి రీవెరిఫికేషన్ కోసం ఫైల్ వచ్చింది. ఈ ఫైల్ కదలకుండా అలాగే ఉంది. ఈ విషయంపై తహసీల్దార్‌ను కలిసి పనులు పూర్తి చేయాలని విన్నవించగా స్పందించలేదు. మధ్యవర్తిగా ఆర్‌ఐ హన్మంత్‌రావు రూ.20లక్షలు డిమాండ్ చేశా డు. తమవద్ద అంత మొత్తంలో డబ్బులు లేవని తెలుపడంతో మొదట రూ.2లక్షలు ఇవ్వాలని డీల్ చేశాడు. రిజిస్ట్రేషన్ అయిన తర్వాత కొన్ని డబ్బులు చెల్లించాలని పేర్కొన్నాడు. దీంతో వారు ఒప్పుకున్నారు. మావల తహసీల్దార్ ఆరిఫా సుల్తానా, ఆర్‌ఐలు డబ్బులు డిమాండ్ చేశారు. ఆదివారం మావ ల తహసీల్దార్ కార్యాలయానికి డబ్బులు తీసుకురావాలని తెలిపారు. దీంతో ఆదిలాబాద్‌లోని ఏసీబీ అధికారులను యతేంద్రనాథ్ యాదవ్ ఈనెల 21న ఆశ్రయించాడు. ఒప్పందం మేరకు యతేంద్రనాథ్ ఆయన సోదరుడితో కలిసి ఆదివారం ఉదయం 11.15 గంటల ప్రాంతంలో డబ్బులు తీసుకొని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. రెవెన్యూ అధికారులకు ముట్టజెబు తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి మొబైల్ ఫోన్లను సైతం స్వాధీనం చేసుకున్నారు.



మావల తహసీల్దార్ కార్యాలయం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి

అవినీతి అధికారుల రిమాండ్..

పట్టుబడిన తహసీల్దార్, ఆర్‌ఐలను కరీంనగర్‌లోని ఏసీబీ కోర్టుకు రిమాండ్ కోసం తరలించినట్లు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. సాయంత్రం వరకు ఇద్దరు అధికారులను విచారించినట్లు తెలిపారు. తహసీల్దార్ ఆరిఫా సుల్తానా, ఆర్‌ఐ హన్మంత్‌రావు పనులు చేసేందుకు డబ్బులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చుతామన్నారు. పనుల కోసం అధికారులు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ఏసీబీని ఆశ్రయించాలని పేర్కొన్నారు.

ఏడు నెలల వ్యవధిలో రెండో ఘటన..

జిల్లాలో అవినీతి అధికారులు ఇటీవల తెరపైకి వస్తున్నారు. ఆయా పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. కొంత మంది తమ పనుల కోసం డబ్బులు ముట్టజెబుతుండగా గత్యంతరం లేక మరికొంత మంది ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు అధికారులతో పాటు రిమ్స్‌లో పనిచేసే మరో జూనియర్ అసిస్టెంట్ ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే. తాజాగా మరో ఇద్దరు రెవెన్యూ అధికారులు ఏసీబీకి పట్టుబడడంతో అవినీతి అధికారుల్లో గుబులు మొదలైంది.

మహా సమ్మేళనానికే గ్రౌండ్ కేటాయింపు

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్ ఎట్టకేలకూ పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం కోసమే కేటాయించడానికి ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ మొగ్గు చూపారు. అక్టోబర్ 1న మహా సమ్మేళనం కోసం గ్రౌండ్ కేటాయించాలని పూర్వ విద్యార్థులు సింగరేణి యాజమాన్యానికి దరఖాస్తు చేసుకోవడంతో అనుమతి లభించింది. కానీ మందమర్రి, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాల్లో భాగంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ప్రోగ్రాం కూడా అదేరోజు ఉండడంతో సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తారని పూర్వ విద్యార్థులు ఆవేదన చెందారు. చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను కలిసి మంత్రి కేటీఆర్ ప్రోగ్రాం మరోచోట నిర్వహించేలా చూడాలని అభ్యర్థించారు. వారి బాధను అర్థం చేసుకున్న సుమన్ మంత్రి ప్రోగ్రాంను మరోచోట నిర్వహించేందుకు ఒప్పుకున్నారు. అంతేకాకుండా పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి పూర్తి సహకారం అందిస్తానని, రెండు కార్యక్రమాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు సింగరేణి హైస్కూల్ పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

దొరగారిపల్లెలో 'మేరామిట్టి, మేరాదేశ్'

మంచిర్యాలటౌన్: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు మేరా మిట్టి, మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని దొరగారిపల్లె నుంచి బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం అమరులైన వీర జవాన్లు, పోలీసుల కోసం నూతనంగా నిర్మిస్తున్న స్మృతి వనం కోసం దేశవ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి మట్టిని సేకరించాలని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి మట్టిని సేకరించి ఢిల్లీకి పంపించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వరరావు, నాయకులు బోయిని హరికృష్ణ, పాలవేని మహేశ్, బల్ల రవి, బండి మల్లికార్జున్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.



మట్టిని సేకరిస్తున్న రఘునాథ్ వెరబెల్లి

ప్రకృతి కనువిందు..



దండేపల్లి మండలంలోని కొత్తమామిడిపల్లిలో ఆదివారం తెల్లవారుజామున మేఘాలు గుట్టలను తాకుతూ కనువిందు చేశాయి. ఆ అందాలకు నేలపై పచ్చని పంటలు మరింత తోడయ్యాయి. ఆ సుందర దృశ్యం ప్రకృతి ప్రేమికుల మనస్సుకు కనువిందు కలిగించింది.

– దండేపల్లి(మంచిర్యాల)